


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శనివారం 24-5-2025

సంపుటి: 21 సంచిక: 52

పేజీలు: 8 వెల: రూ.1

# మరో రాయబారి వచ్చె!

# ఈయన అదే సమాధానమిచ్చె

- ధర్మానను కలిసిన కుంభా రవిబాబు
- 2009 నాటి వాతావరణంపై చర్చ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


మాజీమంత్రి, వైకాపా సీనియర్ నాయకుడు ధర్మాన ప్రసాదరావు వద్దకు వైకాపా పార్లమెంటరీ పరిశీలకుడు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు శుక్రవారం వచ్చారు. జిల్లాలో పార్టీ సమన్వయ సమావేశం నిర్వహించడానికి వచ్చిన రవిబాబు ధర్మాన ఇంటికి వెళ్లి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. జిల్లాలో వైకాపాను చురుగ్గా ముందుండి నడపాల్సిన ఆవశ్యకతను ఆయనకు వివరించారు. ఎప్పటిలాగే రెండేళ్ల వరకు తాను యాక్టివ్ పాలిటిక్స్ చేయలేనని, ఆ తర్వాత తన నిర్ణయం చెబుతానంటూ సూటిగా సమాధానమిచ్చినట్లు తెలుస్తుంది. ఇంతకు క్రితమే ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జిగా పని చేసిన విజయసాయిరెడ్డి ఒకసారి, జిల్లా ఇన్‌ఛార్జిగా వ్యవహరించిన కురసాల కన్నబాబు మరోసారి ధర్మానను కలిసి వైకాపాను బలోపేతం చేయాల్సి ఉందని జగన్మోహన్‌రెడ్డి మాటగా చెప్పినప్పుడు కూడా ధర్మాన ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. ఇప్పుడు తాజాగా కుంభా రవిబాబు కూడా జిల్లాలో వైకాపాకు అనుకూలంగా వాతావరణం ఉందని, ధర్మాన బలమందిస్తే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తం చేయగా, రెండేళ్ల వరకు రోడ్డెక్కి రాజకీయాలు చేయలేనని ఆయన స్పష్టం



చేశారట. 2019లో పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు ధర్మానను మంత్రివర్గంలోకి తీసుకోలేదు. ఆ తర్వాత రెండున్నరేళ్లకు ఆయన సోదరుడు కృష్ణదాస్‌ను తొలగించి, ఈయనకు రెవెన్యూ మంత్రి పదవి ఇచ్చినా, పార్టీలోను, కేబినెట్‌లోనూ సముచిత స్థానం ఇవ్వలేదన్న భావన ఆయన అభిమానుల్లో ఉంది. మంత్రి పదవి ఇచ్చినా గౌరవం మాత్రం దక్కలేదన్న అభిప్రాయమైతే ధర్మానకు ఉంది. జగన్మోహన్‌రెడ్డి స్టైల్‌కు ధర్మాన ఇమడలేకపోయారు. ఉమ్మడి రాష్ట్రంలో రెవెన్యూమంత్రిగా పని చేసి, స్వయంగా రాజశేఖరరెడ్డి, రోశయ్య లాంటి సీనియర్ల మన్ననలు పొంది కిరణ్‌కుమార్ రెడ్డి లాంటి జగన్ వ్యతిరేక శక్తులు కూడా కాదనలేని వ్యక్తిత్వంతో రాజకీయాలు నడిపిన ధర్మాన వైకాపా అధికారంలోకి వచ్చేసరికి ప్రతిపక్షంలో ఉన్నప్పటి కంటే బలహీనపడిపోయారు. పార్టీతో సంబంధం లేనివారిని అడిగి జగన్మోహన్‌రెడ్డి అపాయింట్‌మెంట్ కోరడం, ఆయన్ను కలవాలంటే పదెంచెలు దాటాల్సి రావడం వంటి వ్యవహారాల పట్ల కినుక వహించారు. వీటన్నిటితో పాటు జిల్లాపై తన ప్రభావం లేకుండా చూసేందుకు పార్టీ ప్రయత్నించిందన్న భావన ఆయనలో ఉంది. అందుకే 2024లో పార్టీ ఓటమి తర్వాత ఆయన అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారు. పాలవలస రాజశేఖరం కుటుంబాన్ని పరామర్శించడానికి జగన్ వచ్చినప్పుడు కూడా ధర్మాన నేరుగా వెళ్లి ఆయన్ను కలవాలనుకోలేదు. అందుకే ఆయన తనయుడు రామ్‌మనోహర్‌నాయుడు కేడరంతా జగన్ దగ్గరకు వెళ్లడానికి సమాయత్తం కావాలని మీడియా ముఖంగా పిలుపునిచ్చారు. కానీ చివరి నిమిషంలో ధర్మాన మనసును మార్చిన ఆయన అభిమానులు, కుటుంబ సభ్యులు పాలకొండలో జగన్‌తో భేటీ అయ్యేలా - మిగతా చివరి పేజీలో

## బుకీల వేట మొదలైంది..!

- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలన్నీ సిండికేట్ గుప్పెట్లో ఉంచు కొని అన్నీ తామే చేయాలన్న యోచనలో గత కొన్నేళ్లుగా ఇక్కడి యువతను తప్పుదారి పట్టిస్తున్న గ్రూప్ సభ్యుల ఆట కట్టించేందుకు ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. స్థానికంగా పోలీస్‌స్టేషన్లు ఉన్నా, అందులో సిబ్బంది మాత్రం ఇటువంటి వారిని అరికట్టడంలో వెనుకబడ్డాలని తెలుసుకున్న ఎస్పీ స్వయంగా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేసి, ఎక్కడికక్కడ కట్టడి మొదలుపెట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి ఒప్పంగిలో ధనుంజయ, పాకాల కిశోర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు అత్యంత విశ్వసనీయ వర్గాల భోగట్టా. సన్‌రైజర్స్ (హైదరాబాద్) వర్సెస్ రాయల్ ఛాలెంజ్ (బెంగళూరు) మధ్య ఐపీఎల్ మ్యాచ్ జరుగుతుండగా, ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వీరిద్దర్నీ ఒప్పంగిలో అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తుంది. కొద్ది రోజుల క్రితం నగరంలో పద్మావతి కల్యాణ మండపం వెనుక ఒక పేకాట డెన్ మీద దాడి చేసి, 12 మందిపై కేసు నమోదు చేయడంతో పక్కనే ఉన్న మరో డెన్‌తో పాటు జిల్లాలో పేకాట శిబిరాలు నిర్వహించడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఇప్పుడు ఇద్దరు బుకీలను అదుపులోకి తీసుకున్న తర్వాత నగరంలో సిండికేట్‌గా ఏర్పడి బెట్టింగులను ప్రోత్సహిస్తున్న గ్రూప్ రాత్రి నుంచి కనిపించకుండాపోయినట్టు భోగట్టా. అడ్డదిడ్డంగా పుట్టుకొచ్చిన ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా బయటకు దొరక్కుండా బెట్టింగ్ ఆడిస్తూ పోలీసులకు తెలిసినా ఆధారాలు లేవన్న కారణంతో తమనేమీ చేయలేరని చెలరేగిపోయినవారు ఇప్పుడు కనపడకుండాపోయారు.

## సిరాజ్ మూలాలపై శ్రీకాకుళంలో ఆరా?

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



దేశంలో పలుచోట్ల బాంబులు పేల్చడం ద్వారా శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని ప్లాన్ చేసి నేషనల్ ఇన్వెస్టిగేటివ్ ఏజెన్సీ (ఎన్ఐఏ)కు దొరికిపోయిన విజయనగరానికి చెందిన సిరాజ్ కేసులో ఎన్ఐఏ రెండు రోజుల క్రితం శ్రీకాకుళంలో రహస్యంగా విచారణ జరిపినట్టు తెలుస్తుంది. ఎన్ఐఏ కాబట్టి దీనిని నిర్ధారించే ఆధారాలు లేకపోయినా, శ్రీకాకుళంలో సిరాజ్ బంధువులు ఎవరు, రాకపోకలు జరిగేవా, బ్యాంకు ఖాతాలు ఏవైనా ఉన్నాయా? అన్న కోణంలో ఎంక్వైరీ చేసినట్లు చెప్పుకుంటున్నారు. సిరాజ్ పోలీసులకు చిక్కినప్పుడు దేశంలోని ప్రధాన ప్రాంతాల్లో బాంబు పేలుళ్లకు ప్యాన్ చేశారనే భావించారు. అందులో భాగంగానే హైదరాబాద్ ప్రాంతానికి చెందిన వ్యక్తితో పరిచయాలు వంటి వాటిపై ఆరా తీశారు. కానీ విచారణలో సిరాజ్ తన సొంతూరులోనే పేలుళ్లకు కుట్ర పన్నాడని తేలిందని కొన్ని పత్రికల్లో కథనాలొచ్చాయి. అంటే ఉగ్రవాద మూలాలు మారుమూల జిల్లాలకు కూడా చేరుతున్నాయని భావించిన ఎన్ఐఏ విజయనగరంలో కుట్రకు పాల్పడినవాడు శ్రీకాకుళంలో ధ్వంసరచనకు ఎందుకు పూనుకొనివుండడని భావించే ఇక్కడకు వచ్చినట్లు తెలుస్తుంది. సిరాజ్ మేనమామది షటిల్ సర్వీస్. శ్రీకాకుళంలో కొద్ది రోజులు, విజయనగరంలో కొద్ది రోజులు, విశాఖపట్నంలో తన కుటుంబ సభ్యుల ఆస్తిపాస్తులు చూసుకోడానికి కొద్దిరోజులు తిరుగుతుంటాడని, అలా శ్రీకాకుళంలో ఎవరి అకౌంటులోనైనా సిరాజ్ డబ్బులు వేసున్నాడా? అన్న కోణంలో బ్యాంకు అకౌంట్లను సోదా చేయడానికి ఎన్ఐఏ అడుగులు వేస్తున్నట్టు చెప్పుకుంటున్నారు.

## శాశ్వత సభ్యత్వం పార్టీలో ఒక గౌరవం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తెలుగుదేశం పార్టీ మెంబర్‌షిప్ తీసుకోవడం పార్టీలో ఒక గౌరవమని, రాష్ట్రవ్యాప్తంగా 175అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతున్నాయని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శాశ్వత సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ప్రారంభించారని, ఇదొక మహత్తర కార్యాచరణ అన్నారు. అన్ని వర్గాలకు సముచిత స్థానం ఇచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీ అని, కార్యకర్తలకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని, వారిని దృష్టిలో ఉంచుకొనే ఈ శాశ్వత సభ్యత్వాన్ని అమలుపరిచారన్నారు. శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్న ప్రతీ వ్యక్తికి సౌలభ్య సౌకర్యాలను టీడీపీ కల్పిస్తుందన్నారు. ఇందులో భాగంగా శనివారం జిల్లా నలుమూలల నుంచి వచ్చి శాశ్వత సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు శాశ్వత సభ్యత్వ కార్డులను అందించారు.



### ఎంజీఆర్ ఆధ్వర్యంలోనే

## అక్రమ ఇసుక రవాణా

- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ధ్వజం

(సత్యంన్యూస్, పాతపట్నం)



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తూరు ఇసుక ర్యాంపుల నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోందని, స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలోనే ఇది జరుగుతుందనీ వైకాపా రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తూరు మండలంలోని వంశధార నదిలోని అంగూరు (ఆకులతంపర), నివగాం ఇసుక ర్యాంపుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారన్నారు. ఏవోబీ బోర్డర్ అయినప్పటికీ, సరిహద్దు మీదుగా ఆంధ్ర నుంచి ఒడిశాకు ఇసుక అక్రమ రవాణా జరుపుతున్నారన్నారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ ఒడిశాకు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారన్నారు. నియోజకవర్గం అభివృద్ధి పట్టించుకోకుండా వ్యాపారస్తుడుగా, ఇసుక దోచుకునే నాయకుడుగా పేరు స్థిరబెట్టుకున్నారన్నారు. కేవలం మద్యం వ్యాపారం, ఇసుక దోపిడీ, అధికార దుర్వినియోగం, వ్యవస్థల నిర్వీర్యం చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆమె అన్నారు.




## బలగ రజకులకు అండగా ఉంటాం

### వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నాలుగు తరాలుగా నాగావళి నదిని, దాని ఒడ్డును నమ్ముకొని జీవనం సాగిస్తున్న బలగ ప్రాంతంలో రజకులకు వైకాపా తరఫున అండగా ఉంటామని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం పేర్కొన్నారు. ఈమేరకు శనివారం బలగ శాంతినగర్ కాలనీ వద్ద ఉన్న దోబీఘాట్‌ను ఆయన నగర పార్టీ అధ్యక్షుడు సాధు వైకుంఠంతో కలిసి పరిశీలించారు. నాలుగు తరాలుగా 80 కుటుంబాలు ఇక్కడ బతుకుతున్నాయని తెలుసుకున్న అప్పటి మంత్రి ధర్మాన ప్రసాదరావు వీరికోసం ప్రత్యేకంగా దోబీఘాట్‌లు నిర్మించారని, దాన్ని అభివృద్ధి చేయాల్సిన కూటమి ప్రభుత్వం కూల్చేసి పార్క్‌ను కడతామనడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు పురుషోత్తం తెలిపారు. 1976లోనే ఇక్కడ రజకుల కోసం ఒక నేలబావిని, బండలను ఏర్పాటు చేశారని, నదీ గమనం మారిన తర్వాత నేరుగా నది ఒడ్డునే షెడ్డులు నిర్మించి దోబీఘాట్‌లను ధర్మాన ఏర్పాటు చేయించారన్నారు. ఇప్పుడు వీటిని తొలగించి పార్క్‌ను నిర్మిస్తే ఈ కుటుంబాలు రోడ్డున పడతాయని, అదే జరిగితే వైకాపా రోడ్డెక్కడం ఖాయమని గేదెల పురుషోత్తం హెచ్చరించారు. స్థానికులు ఎమ్మెల్యేను కలిసి వారి అభ్యర్థన వ్యక్తం చేస్తే సగం భూమిని వదిలేయాలని బేరసారాలకు దిగడం సరికాదని, బలగ, రిమ్స్ ప్రాంతానికి ఉన్న ఏకైక దోబీఘాట్‌ను తొలగిస్తే ఉద్యమిస్తామన్నారు. సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు ఇస్తామని, పాలకులు పార్క్ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకపోతే రజకుల తరఫున పోరాడతామన్నారు. వీరితో పాటు బాణ్ణ పవన్, బట్ట సీతన్న తదితరులు పాల్గొన్నారు.

## సిక్సు కొట్టాడు.. రూ.5 లక్షల ఫైన్ కట్టాడు..!

**ఐపీఎల్ అంటేనే మనీ మెషిన్. ఇటు బీసీసీఐకి, అటు ప్లేయర్లకు కాసుల పంట. ప్రతీ ఏడాది కోట్లాది రూపాయల సాలరీలు అందుకోవడమే కాకుండా, గేమ్‌లో రాణిస్తే వివిధ రూపాల్లో డబ్బులు వచ్చి పడతాయి. అత్యధిక సిక్సులు కొట్టినందుకు కూడా ప్రైజ్ మనీ గెలుచుకుంటారు. కానీ ఎస్ఆర్‌హెచ్ ప్లేయర్ అభిషేక్ శర్మ శుక్రవారం ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో కొట్టిన సిక్సుకు రూ.5 లక్షలు జరిమానా కట్టాల్సి వచ్చింది.**

లక్నోలోని ఏక్నా స్టేడియంలో హైదరాబాద్, బెంగళూరు మధ్య జరిగిన ఐపీఎల్ లీగ్ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ఒక భారీ సిక్స్ కొట్టాడు. అది కాస్తా.. బౌండరీ వెలుపల డిస్‌ప్లే కోసం పెట్టిన టాటా కర్వ్ వి కారుకు తాకింది. కార్ విండ్ షీల్డ్‌ను ఆ బంతి డ్యామేజ్ చేసింది. దీంతో అభిషేక్ శర్మ రూ.5 లక్షలు కట్టాల్సి వచ్చింది.

### ఎందుకీ ఫైన్?

బ్యాటర్లు కావాలని కారును డ్యామేజ్ చేయడానికి సిక్సులు కొట్టరు కదా! బౌలర్లు వేసే బంతులను బట్టి దాన్ని ఎటువైపు కొట్టాలో అప్పటికప్పుడు డిసైడ్ అవుతారు. టాటా వాళ్ల ప్రచారం కోసం కార్లను మైదానంలో పెట్టి, దాన్ని డ్యామేజ్ చేస్తే ఫైన్ అంటే ఎలా అని చాలామంది మండిపడుతున్నారు. ఇక్కడే ఉంది అసలు ట్విస్ట్. ఐపీఎల్ స్టార్ట్ కాకముందే బీసీసీఐ, టాటా మోటార్స్‌కి మధ్యలో ఒక ఒప్పందం జరిగింది. ఏ ప్లేయర్ అయినా కారును డ్యామేజ్ చేసేలా సిక్సులు లేదా బౌండరీలు కొడితే ప్రతీ డ్యామేజీకి రూ.5లక్షలు ఫైన్ కట్టాలని, ఆ డబ్బులను గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ అభివృద్ధి కోసం, పేద క్రికెటర్ల కిట్ బ్యాగుల కొనుగోలుకు ఉపయోగించాలని నిర్ణయించారు. అంటే ఇప్పుడు అభిషేక్ శర్మ నుంచి వసూలుచేసే మొత్తంతో కిట్ బ్యాగులు కొని పంచుతారన్నమాట.

పేద క్రికెటర్లకు కిట్ బ్యాగులు పంచడం వరకు బానే ఉంది. కానీ ప్లేయర్ల నుంచి వసూలు చేయడం దేనికి? బీసీసీఐ వేలకోట్ల లాభాల్లో ఉన్న క్రికెట్‌బోర్డు. టాటా మోటార్స్ ఎంత బడా సంస్థనో చెప్పనక్కర లేదు. వీళ్లిద్దరూ కలిసి కిట్ బ్యాగులు పంచాలనుకుంటే.. సొంత డబ్బులు వాడుకోవాలి కానీ.. క్రికెటర్ల నుంచి ఎందుకు గుంజడం? సరే అభిషేక్ శర్మకు అయితే సాలరీ రూపంలో భారీగానే వస్తాయి కాబట్టి రూ.5 లక్షలు కడతాడు. ఎవరైనా ఒక అన్‌క్యాప్డ్ ప్లేయర్.. కేవలం రూ20 లక్షల సాలరీతో ఆడుతున్నాడనుకోండి.. అతను నాలుగు సిక్సులు బాది కారును డ్యామేజ్ చేస్తే.. అతనికి వచ్చేది సున్నా.. అసలు ఆ కారుకు కొత్త విండ్ షీల్డ్ వేసినా అంత ఖర్చు కాదు. బీసీసీఐ, టాటా మోటార్స్ కలిసి చేసే స్వచ్ఛంద సేవకు డబ్బులు ప్లేయర్లు ఇవ్వాలన్నమాట. బాగుంది మాష్టారూ మీ ఐడియా.

- భాయ్‌జాన్



• ఎడిటోరియల్

# వినోద ఆదాయం వికాసానికి దోహదపడాలి!

ఇండియన్ ప్రీమియర్ లీగ్.. ముక్తసరిగా చెప్పాలంటే ఐపీఎల్.. ప్రపంచంలోని అత్యంత ఖరీదైన ఐదు క్రీడా ఈవెంట్లలో ఒకటి. ఆదాయంలోనూ దానికదే సాటి. గణాంకాలు పరిశీలిస్తే.. ఐపీఎల్ 2023లో ఐపీఎల్ ద్వారా భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) రికార్డు స్థాయిలో రూ.5,120 కోట్ల ఆదాయం ఆర్జించింది. మొత్తం టర్నోవర్ రూ.11,770 కోట్లకు చేరుకుంది. దీనికి మీడియా హక్కులే ప్రధాన కారణం. ఇక 2024, 2025 అంచనాల ప్రకారం ఐపీఎల్ వార్షికాదాయం రూ.12 వేల నుంచి రూ.13,500 కోట్లు. ఇది ప్రపంచంలోని అతిపెద్ద క్రీడా ఆదాయ వ్యవస్థల్లో ఒకటి. ప్రతి ఏటా ఈ క్రీడా సంబరం ప్రపంచాన్ని అబ్బురపరుస్తూనే ఉంది. మ్యాచ్‌లు జరిగే స్టేడియాలు ప్రేక్షకులతో కిక్కిరిసిపోతుంటాయి. అంతేకాకుండా టీవీలు, శాటిలైట్ ఛానళ్ల ద్వారా వీటి ప్రత్యక్ష ప్రసారాలను కోట్లాది అభిమానులు వీక్షిస్తుంటారు. ఫలితంగా బిలియన్ల విలువైన ప్రకటనల వర్షం కురుస్తుంటుంది. కానీ ఇంత పెద్ద ఆదాయంలో కొద్దిపాటి ట్యాక్సులు తప్ప మిగిలినదంతా బీసీసీఐ వద్దే పోగుపడిపోతోంది. వందల కోట్ల ఆ ఆదాయాన్ని అలా వృథాగా ఉంచేసే బదులు అందులో కొంతయినా దేశాభివృద్ధికి ఉపకరించే పరిశోధనలు, నూతన ఆవిష్కరణలకు వెచ్చిస్తే ఎంత బాగుంటుంది! వినోదం ద్వారా విజ్ఞానం, వికాసం సాధించగలిగితే అంతకుమించిన అద్భుతం ఇంకేముంటుంది. కానీ బీసీసీఐ ఇటువంటి ఆలోచన చేయక పోగా దాతృత్వ హోదా కింద ప్రభుత్వం నుంచి ఆదాయ పన్ను మినహాయింపులు పొందుతోంది. ఐపీఎల్ ఫ్రాంచైజీలన్నీ బిలియనీర్ల యాజమాన్యంలోనే ఉన్నాయి. మూలధన లాభాలపై పన్ను రాయితీల ప్రయోజనం కూడా పొందుతాయి. ఆటగాళ్ల రెమ్యూనరేషన్‌పై వ్యక్తిగతంగా పన్ను విధిస్తున్నారు. కానీ ఫ్రాంచైజీ లాభాలు, బీసీసీఐ ఆదాయాలు కార్పొరేట్ పన్ను నుంచి తప్పించుకుంటున్నాయి. ఐపీఎల్ ద్వారా బీసీసీఐకి వచ్చే లాభాలపై 40 శాతం పన్ను వర్తింపజేస్తే మూడేళ్లలో సుమారు రూ.15 వేల కోట్లు సేకరించవచ్చు. పది కొత్త ఐఐటీలకు లేదా జాతీయ డీప్-టెక్ ఇన్నోవేషన్ కార్పస్ ఫండ్ సమకూర్చడానికి ఈ మొత్తం సరిపోతుంది. దీనికి ఫ్రాంచైజీ లాభాలను కూడా జోడిస్తే ఏటా మరో రూ.400 కోట్లు సేకరించవచ్చు. మొత్తంగా ఏడాదికి సుమారు రూ. ఆరువేల కోట్ల వరకు పరిశోధన రంగానికి మళ్లించవచ్చు. కానీ ప్రస్తుతం దేశంలో దీనికి విరుద్ధంగా జరుగుతోంది. పరిశోధన సంస్థలు, ప్రయోగశాల పరికరాలు, వినియోగ వస్తువులు, సాఫ్ట్‌వేర్ లైసెన్స్‌లపై జీఎస్టీ వసూలు చేస్తున్న ప్రభుత్వం వినోద రంగానికి మాత్రం సబ్సిడీలు ఇవ్వడం విడ్డూరం. ఐపీఎల్ మాత్రమే కాకుండా సినిమా నిర్మాణాలు సైతం పన్ను మినహాయింపులు, సబ్సిడీలు పొందుతున్నాయి. మతపరమైన ట్రస్టులు పూర్తి పన్ను మినహాయింపులు అనుభవిస్తూనే తమ వాణిజ్య సామ్రాజ్యాలను విస్తరించుకుంటున్నాయి. కొత్త స్పోర్ట్స్ లీగ్‌లకు స్టార్టప్ ట్యాక్స్ హాలీడే ఇస్తున్నారు. దేశంలో డబ్బుకు కొరత లేకున్నా భవిష్యత్తు కోసం పెట్టుబడి పెట్టాలనే దృక్పథం మనకు లేదు. తక్షణ రాబడి కోసం ప్రయత్నిస్తున్న వ్యాపారవేత్తలే ఆధిపత్యం చెలాయిస్తున్నారు. పరిశోధన, ఆవిష్కరణ, ప్రాథమిక సాంకేతిక అభివృద్ధిని 'అధిక రిస్క్.. తక్కువ రిటర్న్' వ్యాపారాలుగా మాత్రమే చూస్తున్నారు. అదే అమెరికా, చైనా, జర్మనీ వంటి దేశాలు పరిశోధనలకు ఎక్కువ నిధులు సమకూర్చడం ద్వారా సంపదను నిర్మించుకున్నాయి. మనం మాత్రం పునాదులు నిర్మించకుండా సంపదను వెతుకుతున్నాం. మన పాలకుల, పెట్టుబడిదారుల ఆలోచన ఎలా ఉందంటే.. 'ఐపీఎల్ వంటి ఈవెంట్ల ద్వారా వినోదం అస్వాదిస్తాం.. కానీ దేశానికి అవసరమైన సెమీ కండక్టర్లను మాత్రం దిగుమతి చేసుకుంటాం. ఒకవైపు సినిమాల నిర్మాణ వ్యయాన్ని వందల కోట్ల నుంచి వేల కోట్లకు పెంచామని గర్వంగా చెప్పుకొంటున్న మనం.. అదే సమయంలో ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణల్లో చాలా వెనుకబడి ఉన్నాం. మన పారిశ్రామిక సంస్థలు తమ పెట్టుబడుల కోసం విచ్చలవిడిగా ఐపీవోలకు వెళుతున్నా.. కొత్త ఆవిష్కరణలకు కీలకమైన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డి) రంగాన్ని మాత్రం ఆర్థికంగా పరిపుష్టం చేయడానికి ఇష్టపడం.' క్రీడలు, వినోద రంగాల అభివృద్ధికి ఎవరూ వ్యతిరేకం కాదు. అవి కూడా చాలా ముఖ్యమైనవే. కానీ ప్రాధాన్యతల దృష్టికోణం అత్యవసరం. దేశానికి ఏది అత్యవసరం.. ఏ రంగం వల్ల అత్యధిక ప్రతిఫలం, భవిష్యత్తు వికాసం సాధ్యమవుతుందో గుర్తించి ఆ రంగాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. వినోదం వర్తమానాన్ని సజీవంగా ఉంచుతుంది. పరిశోధన భవిష్యత్తును నిర్మిస్తుంది. దీన్ని పరిగణనలోకి తీసుకోకతప్పదు.

# జగన్మోహనరెడ్డి భ్రమల్లో బతుకున్నారు

- జగన్ మోహన్ రెడ్డి 5 ఏళ్ల పాలనలో జీవితకాలానికి సరిపడా తప్పులు చేశారు.
- జగన్మోహన్ రెడ్డి గారు చేసిన అవినీతి, అక్రమాలకు తగిన శిక్ష పడడం ఖాయం:
- ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 22న 3రోజుల పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్‌షాను కలిసి, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారనీ. అనంతరం, 23న పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమై, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను చర్చించారనీ, 24న నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొని రాష్ట్ర అవసరాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారనీ విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలియజేశారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పర్యటన ద్వారా రాష్ట్రానికి ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో కేంద్రం నుండి సహకారం కోసం చంద్రబాబు గారు కృషి చేశారని వెల్లడించారు. ప్రతిసారీ ఢిల్లీ పర్యటనలో కేంద్రమంత్రులను కలిసిన తర్వాత ప్రెస్‌మీట్ ద్వారా రాష్ట్రానికి ఏయే ప్రయోజనాలు రాబోతున్నాయి, ఏ మంత్రి తో మనం ఏమి మాట్లాడాం అనేది 5 కోట్ల ఆంధ్రులకు చంద్రబాబు గారు స్పష్టంగా వివరిస్తారని కలిశెట్టి తెలిపారు. ఈ సందర్భంగా కలిశెట్టి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోమహనరెడ్డిపై పలు విమర్శలు చేశారు. గత 5 ఏళ్లలో జగన్ రెడ్డి తన వ్యక్తిగత కేసుల కోసం తప్ప, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీకి ఒక్క రోజు కూడా వెళ్లలేదని, రాష్ట్రానికి సాధించిన ఒక్క ప్రయోజనాన్ని కూడా ప్రజలకు వివరించలేదని ఆరోపించారు. జగన్ రెడ్డి గారి పాలనలో అవినీతి, అక్రమాలు విపరీతంగా పెరిగాయని, దీని వల్ల రాష్ట్రం ఆర్థికంగా, సామాజికంగా దెబ్బతిన్నదని ఆయన పేర్కొన్నారు. జగన్ తమ జీవితకాలంలో చేయాల్సిన తప్పులను కేవలం 5 ఏళ్లలోనే చేశారని, మరోసారి అధికారంలోకి వస్తామనే అబద్ధంలో జీవిస్తున్నారని కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. జగన్ రెడ్డి 5ఏళ్ల పాలనలో అవినీతి, అక్రమాలు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాయని ఆరోపించారు. ఈ పాలన వలన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కూడా అవినీతి కేసుల్లో జైళ్లకు వెళ్లే దుస్థితి ఏర్పడిందని ఆయన విచారం వ్యక్తం చేశారు. జగన్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలకు తగిన శిక్ష తప్పక



పడుతుందని కలిశెట్టి అప్పలనాయుడు హెచ్చరించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జగన్ అవినీతి గురించి ప్రజలు గుర్తు చేసుకోవాలని ఆయన కోరారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ప్రజలకు అనేక విధాలుగా సంక్షేమ పథకాలు చేరువవుతున్నాయన్నారు. చంద్రబాబు నాయుడు 15 ఏళ్ల ముఖ్యమంత్రి పాలనను గుర్తు చేస్తూ, ఆయన పాలనలో ఒక్క అధికారి కూడా అవినీతి, అక్రమాల కేసుల్లో జైలుకు వెళ్లలేదని పేర్కొన్నారు. జగన్ పాలనకు, చంద్రబాబు పాలనకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం సాంకేతిక, ఆర్థిక, మౌలిక రంగాలలో గణనీయమైన పురోగతి సాధించిందని, ఆయన ఎల్లప్పుడూ పారదర్శకత, జవాబుదారీతనంతో పాలన సాగించారని కలిశెట్టి అప్పలనాయుడు గారు కొనియాడారు.

చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పనిచేయడం తనకు ఎంతో గర్వకారణమని ఈ సందర్భంగా కలిశెట్టి ఉద్ఘాటించారు. చంద్రబాబు రాష్ట్ర ప్రయోజనాల కోసం నిరంతరం కృషి చేస్తూ, కేంద్ర మంత్రుల నుండి గౌరవం పొందుతున్నారని, ఆయన కష్టాన్ని దగ్గరగా చూస్తున్నప్పుడు ఎంతో సంతో షంగా, గర్వంగా ఉందని ఆయన అన్నారు. 5కోట్ల తెలుగు ప్రజల కోసం చంద్రబాబు చేస్తున్న నిస్వార్థ సేవను ప్రతి ఒక్కరూ గుర్తించాలని కలిశెట్టి అప్పల నాయుడు పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు పెడుతుందని, దీనిని ప్రజలు గమనించాలన్నారు. ఆయన నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుం దని కలిశెట్టి అశాభావం వ్యక్తం చేశారు.

# కేశవరావు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించండి

(సత్యంన్యూస్, పలాస)

సిపిఐ మావోయిస్టు పార్టీ అఖిలభారత ప్రధానకార్యదర్శి కామ్రేడ్ నాంబాల కేశవరావు అలియాస్ బసవరాజు గంగన్న ఆయనతోపాటు 27మందినీ బూటకపు ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేశారని, ఆయన హత్యపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని, ఆయన భౌతికకాయం కుటుంబ సభ్యులకు అప్పగించాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, లిబరేషన్,పౌర హక్కుల సంఘం, దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం, అమరుల బంధుమిత్రుల సంఘం, ప్రజా కళామండలి, ప్రగతిశీల కార్మిక సమైక్య, సిపిఎం పార్టీల ఆధ్వర్యంలో శనివారం పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో నిరసన ర్యాలీకి సిద్ధమైతే పర్మిషన్ లేదనే పేరుతో కాశిబుగ్గ పోలీసులు అడ్డుకున్నారు. దీనిని అందరూ ఖండించాలని తక్షణమే మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని, ఆపరేషన్ కగార్, ఆదివాసీల హననం ఆపాలని డిమాండ్ చేస్తూ పార్టీ కార్యాలయం పత్రిక విలేకరుల సమావేశం జరిగింది. అనంతరం రాజ్యహింసను వ్యతిరేకిస్తూ రాజ్యాంగబద్ధంగా పాలించాల్సిన పాలకులు చట్టాలను ఉల్లంఘించి రాజ్యాంగం పక్కనపెట్టి అన్యాయంగా దుర్మార్గంగా ఈ దేశ పౌరులైన ఆదివాసీల పైన, మావోయిస్టులని టార్గెట్ చేసుకొని 550మందిని ఇప్పటికే చంపారన్నారు. కార్పొరేటర్లకు అడవులను అప్పగించడానికి అందుకు ఆటంకంగా ఆదివాసీలు ఉన్నారని ఆదివాసీలను, మావోయిస్టులను, ప్రశ్నించే వాళ్లను అందరినీ చంపుకుంటూపోతున్నారన్నారు. ప్రజలు ప్రజాస్వామికవాదులు బుద్ధి జీవులు ఈ సంఘటనపై నిరసన వ్యక్తం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్తిరి ధానేషు, లిబరేషన్ నాయకులు రామారావు, పిడియం రాష్ట్ర నాయకులు సాలిన. వీరాస్వామి, అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర నాయకులు జోగి. కోదండరావ్, తామాడ త్రిలోచన, పోతనపల్లి అరుణ, కుర్రా ఈ నీలకంఠం, మద్దెల ధర్మారావు, పుచ్చ దుర్యోధన, దాసరి శ్రీరాములు,జీడి రైతు సంఘం నాయకులు తెప్పల అజయ్, ప్రగతిశీల మహిళా సంఘం పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్షులు బతకల.ఈశ్వరమ్మ అఖిల భారత రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు మామిడి భీమారావు, వంకల పాపయ్య, సారా జగన్ బర్ల గోపి తదితరులు పాల్గొన్నారు






ఓవైపు క్యారెక్టర్.. విలన్ పాత్రలతో అలరిస్తూనే అప్పుడప్పుడూ హీరోగానూ మెరుస్తుంటాడు తమిళ నటుడు విజయ్ సేతుపతి. గత ఏడాది అతడి నుంచి వచ్చిన 'మహారాజా' ఎంత పెద్ద హిట్ అయిందో తెలిసిందే. ఇప్పుడతను కథానాయకుడిగా 'ఏస్' అనే సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తమిళంతో పాటు తెలుగులోనూ ఒకేసారి విడుదలైన ఈ చిత్ర విశేషాలేంటో చూద్దాం పదండి.

**కథ:బోల్ట్ కాశి (విజయ్ సేతుపతి) ఉపాధి కోసం మలేషియాకు వెళ్లి అక్కడ తనకు తగ్గ పని కోసం చూస్తుంటాడు. అతడికి అనుకోకుండా పరిచయం అయిన రుక్మిణి (రుక్మిణి వసంత్)తో అతను ప్రేమలో పడతాడు. కొన్ని రోజుల తర్వాత రుక్మిణి కూడా అతణ్ని ఇష్టపడుతుంది. ఓ సమస్యలో ఉన్న రుక్మిణిని ఆదుకోవడం కోసం పేకాట ఆడిన కాశి.. కోటి రూపాయల బకాయి పడతాడు. ఆ అప్పు తీర్చడానికి ఇంకా పెద్ద రిస్క్ చేయడానికి సిద్ధపడతాడు కాశి. ఇంతకీ అతను చేయాలనుకున్న రిస్క్ ఏంటి.. ఆ పని విజయవంతంగా పూర్తి చేశాడా.. తనతో పాటు రుక్మిణి సమస్య తీరిందా లేదా అన్నది మిగతా కథ.**

# సోసో థ్రిల్లర్!

**నటీనటులు:** సేతుపతి నటనకు వంకలు పెట్టడానికేమీ లేదు. బలహీనమైన కథను వీలైనంత మేర నిలబెట్టడానికి అతను కృషి చేశాడు. ఎక్కువ హడావుడి చేయకుండానే ప్రభావవంతంగా నటిస్తూ ప్రేక్షకులను ఎంగేజ్ చేశాడు సేతుపతి. హీరోయిన్ రుక్మిణి వసంత్ ఓకే. కొన్ని సన్నివే శాల్లో కళ్లతో బాగా నటించింది. యోగిబాబు కామెడీ సినిమాలో పెద్ద రిలీఫ్. తన మార్కు నటనతో నవ్వించా డు. దివ్యా పిళ్లై కూడా బాగానే చేసింది. సీనియర్ నటుడు పృథ్వీ పాత్ర గందరగోళంగా అనిపిస్తుంది. ఆ పాత్రను సరిగా తీర్చిదిద్దలేదు. తన నటన పర్వాలేదు. 'కేజీఎఫ్' ఫేమ్ అవినాష్.. మిగతా నటీనటులంతా మామూలే.

### కథనం-విశ్లేషణ:

మామూలు పాత్రలను కూడా తన పెర్ఫామెన్సుతో ప్రత్యేకంగా మార్చే నటుడు విజయ్ సేతుపతి. తనకు మంచి పాత్ర.. విషయం ఉన్న కథ పడితే ఆ సినిమాను వేరే స్థాయికి తీసుకెళ్లిపోతాడు. 'మహారాజా' సినిమాలో అదే జరిగింది. పేపర్ మీద చూస్తే 'ఏస్' కథ.. సేతుపతి పాత్ర కూడా ఆసక్తికరంగానే అనిపిస్తాయి. బతుకు తెరువు కోసం వేరే దేశానికి వెళ్లి వ్యక్తి.. ఒక సమస్య నుంచి బయటపడ్డానికి తప్పు చేసి.. ఆ తర్వాత దాన్ని కవర్ చేయడానికి ఇంకా పెద్ద తప్పు చేసి పెద్ద విష వలయంలో చిక్కుకోవడం.. చివరికి తన తెలివితేటలు ఉపయోగించి మొత్తం సమస్య నుంచి బయటపడడం.. ఇదీ స్థూలంగా 'ఏస్' కథ. చిన్న నిప్పు రవ్వతో మొదలై పెద్ద కార్చిచ్చుగా మారడం.. ఈ లైన్లో నడిచే స్టోరీ ప్రేక్షకుల్లో కొంత క్యూరియాసిటీ రేకెత్తిస్తుంది. కానీ ఎగుడు దిగుడుగా సాగే కథనం వల్ల 'ఏస్' పూర్తి సంతృప్తినిచ్చే సినిమాగా రూపుదిద్దుకోలేకపోయింది. కొన్ని ఎపిసోడ్ల వరకు ఓకే అనిపించినా.. అంతిమంగా మిశ్రమానుభూతినే మిగులుస్తుంది.

'ఏస్' క్రైమ్ ఎలిమెంట్స్ చుట్టూ తిరిగే కథ. ఇందులో హీరో పెద్ద దొంగతనం చేస్తాడు. అతణ్ని పట్టుకోవడానికి ఇటు పోలీసులు.. అటు రౌడీ గ్యాంగులు ప్రయత్నిస్తుండగా క్యాట్ అండ్ మౌస్ గేమ్ లాగా సినిమా నడుస్తుంది. ఐతే మలేషియా లాంటి అభివృద్ధి చెందిన దేశంలో పట్ట పగలు ఏటీఎంలో డబ్బులు నింపే వాహనం నుంచి హీరో కోట్ల రూపాయలు కొట్టేస్తాడు. అత్యున్నత స్థాయి పోలీస్ విభాగం, అధునాత టెక్నాలజీ ఉండి కూడా అతణ్ని పట్టుకోలేకపోవడమే విడ్డూరంగా అనిపిస్తుంది. కథలో అత్యంత కీలకమైన ఇలాంటి ఎపిసోడ్లు తీసేటపుడు.. సన్నివేశాలు పకడ్బందీగా ఉండేలా చూసుకోవాలి. తెర మీద జరిగేదంతా ప్రేక్షకులకు కన్విన్సింగ్ గా అనిపించాలి. కానీ ఈ సినిమాలో అవే మిస్ అయ్యాయి. హీరో చాలా సింపుల్ గా దొంగతనం చేసేస్తాడు. అంతే సింపుల్ గా పోలీసుల నుంచి తప్పించుకుంటాడు. తన కోసం పోలీసులు పెద్ద ఎత్తున వెతుకుతున్నా.. ఓ దశలో అడ్డంగా దొరికిపోయినా.. తనలో రవ్వంతైనా టెన్షన్ కనిపించదు. అలా అని అతను వేసే ప్లాన్లు ఏమైనా అద్భుతంగా ఉంటాయా అంటే అదీ లేదు. గాలి వాటంగా ఏదో చేసుకుపోతుంటాడు. ఇలా కన్వీనియెంట్ గా సన్నివేశాలు రాసుకోవడంతో 'ఏస్' ఇంపాక్ట్ తగ్గిపోయింది. కానీ సేతుపతి మాత్రం తన పెర్ఫామెన్సుతో వీలైనంతగా ఎంగేజ్ చేయడానికి ప్రయత్నించాడు. తనతో ముడిపడ్డ కొన్ని సన్నివేశాలు ఆసక్తికరంగా సాగడంతో సినిమా మరీ బోర్ అయితే కొట్టించదు.

ఓవరాల్ గా 'ఏస్' ఇంపాక్ట్ తగ్గినా.. కొన్ని ఎపిసోడ్ల వరకు ఆసక్తికరంగా అనిపిస్తాయి. ప్రథమార్ధంలో వచ్చే పేకాట ఎపిసోడ్ ప్రేక్షకులను అలరిస్తుంది. ఆ ఎపిసోడ్లో ఉన్న ఉత్కంఠకు తోడు.. యోగిబాబు కామెడీ ఆకట్టుకుంటాయి. ఆరంభ సన్నివేశాలు సాధారణంగా అనిపించినా.. ఈ ఎపిసోడ్ దగ్గర కథనం ఊపందుకుంటుంది. ఆ తర్వాత కథలో అనేక మలుపులు వస్తాయి. దొంగతనం ఎపిసోడ్ అంత కన్విన్సింగ్ గా లేకపోయినా.. చివరి అరగంటలో రేసీగా సాగే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. క్లైమాక్సే సినిమాకు బలం. ఆఖర్లో హీరో ఆడే గేమ్ ప్రేక్షకులకు కిక్కిస్తుంది. చివరికి హీరో గెలుస్తాడు అన్నది కామనే అయినా.. ఇక్కడ కూడా కన్వీనియెంట్ గా సన్నివేశాలను రాసుకున్నా.. క్లైమాక్స్ మెప్పిస్తుంది. దర్శకుడు ఆఖర్లో చూపించిన షార్ప్ నెస్.. కథనంలో వేగం ముందు కూడా ఉండి ఉంటే 'ఏస్' జనరంజకమైన సినిమా అయ్యుండేది. రెండున్నర గంటలు ఏదో అలా టైంపాస్ చేయాలనుకుంటే.. విజయ్ సేతుపతి పెర్ఫామెన్స్ చూడాలనుకుంటే 'ఏస్'పై ఓ లుక్కేయొచ్చు కానీ.. అంతకుమించి ఆశిస్తే కష్టం.

- తుపాకి.కామ్ సౌజన్యంతో..

### సాంకేతిక వర్గం:

టెక్నికల్ గా 'ఏస్' ఏమంత గొప్పగా అనిపించదు. సామ్ సీఎస్ పాటలు పెద్దగా ఆకట్టుకోవు. నేపథ్య సంగీతం మాత్రం సన్నివేశాలను కొంతమేర ఎలివేట్ చేసింది. కరణ్ రావత్ సినిమాటోగ్రఫీలో మెరుపులేమీ లేవు. నిర్మాణ విలువలు పర్వాలేదు. శ్రీ పద్మిని సినిమాస్ బి. శివ ప్రసాద్ తెలుగు లో రిలీజ్ చేసారు . రైటర్ కమ్ డైరెక్టర్ ఆర్ముగ కుమార్ రాసుకున్న కథలో విషయం ఉన్నా.. దాన్ని తెర మీద సరిగా ఎగ్జిక్యూట్ చేయలేకపోయాడు. థ్రిల్లర్ కథలకు రేసీ స్క్రీన్ ప్లే.. పకడ్బందీ సీన్లు ఉంటేనే పండుతాయి. ఆర్ముగ కుమార్ చాలా వరకు కన్వీనియెంట్ రైటింగ్ తో సినిమా గ్రాఫ్ తగ్గించేశాడు. కొన్ని ఎపిసోడ్ల వరకు అతను మెప్పించినా.. ఓవరాల్ గా అతడికి యావరేజ్ మార్కులే పడతాయి.

## 26న కొత్తూరు రచయితల వేదిక సమావేశం

(సత్యంన్యూస్, కొత్తూరు)

ఈనెల 26వ తేదీన సోమవారం ఉదయం కొత్తూరు రచయితల వేదిక రెండోనెల సమావేశం నిర్వహించనున్నట్లు వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కుదమ తిరుమలరావు తెలిపారు. కొత్తూరు మండల కేంద్రంలో గల విజ్ఞాన భారతి పాఠశాల ఆవరణలో ఉదయం 8.30కి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సాహితీవేత్త పొట్నూరు కోటిబాబు విచ్చేయనున్నారని తిరుమలరావు తెలిపారు. వారి సమక్షంలో కవి సమ్మేళనం, వారి చేతులమీదుగా కవులకు సన్మానాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ప్రతిభావంతులుగా ఎంపికైన ఆరుగురు బాలురకు, ఆరుగురు బాలికలకు పన్నెండు కాపీ బుక్స్‌ని ప్రోత్సహించనున్నామన్నారు. కార్యక్రమంలో సభాధ్యక్షులు కుదమ తిరుమలరావు, ముఖ్య అతిథి పొట్నూరు కోటిబాబుతో పాటు సభ్యులు ముదిల శంకరరావు, అమ్మల కామేశ్వరి, మావుదూరు మురళీకృష్ణ, డా.యెన్ను అప్పలనాయుడు, కలమట శ్రీరాములు, గేదెల మన్మధరావు, పెదకోట ధనుంజయరావు, ఎ.వి.ఆర్. ఎం.దిలీప్ రాజా పట్నాయక్, బూరాడ గణేష్, పల్ల నారాయణరావు, గడసాపు ఉషారాణి, కలమట గోవిందరావు, ఉర్జాన ప్రసాదరావు, బూడిద సంతోష్ కుమార్, గూనాపు శార్వాణి, శెట్టి భానోజీరావు, గణపతి, దుక్క గణపతిరావు, వలురౌతు ప్రసాదరావు తదితర కవిమిత్రులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

## సిక్కోలు సేవా సమితి ఆర్థిక సహాయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా, కల్లేపల్లి పంచాయతీ మోహన్‌బందర్‌కు చెందిన ఏడేళ్ల వయసు గల స్రవంతి బోన్‌మేరో క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఆమెకు విశాఖలోని మెడికవర్ చికిత్స అందిస్తున్నారు. రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీరు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ చిన్నారికి బోన్‌మేరో ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీ చేయాల్సి ఉంది. ఇందుకుగాను సుమారు రూ.25లక్షల ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.10 లక్షలు మంజూరైంది. మిగతా డబ్బు కోసం దాతల సహాయం కోరుతున్నారు. విషయం తెలిసిన వెంటనే సిక్కోలు స్వచ్ఛంద సంస్థ పాప వైద్యం కోసం మన సంస్థ తరఫున మెరైన్ పోలీస్ ఎస్ఐ మహాలక్ష్మి చేతుల మీదుగా రూ.20వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అవినాష్, జగదీష్, చంద్రశేఖర్, ఎస్సై మహాలక్ష్మి, వెంకట్రావు, నరసింహ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు



## శాంతి సాంస్కృతిక ఉద్యమాల సారథి సుకుమారన్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దేశంలో సాంస్కృతిక సహకారం ద్వారా శాంతిని పెంపొందించడానికి తీవ్రంగా కృషి చేసిన గొప్ప అభ్యుదయవాది టి.ఎస్. సుకుమారన్ అని జిల్లా జిల్లా అధ్యక్షులు ఎమ్. వి. మల్లేశ్వరరావు కొనియాడారు. భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) జాతీయ కార్యదర్శిగా కొనసాగుతున్న టి.ఎస్. సుకుమారన్ విశాఖ పట్నంలోని తన స్వగృహంలో మంగళవారం మరణించడం పట్లజిల్లా సమితి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసారు. క్రాంతి భవన్ లో భవన్లో శనివారం భారత సాంస్కృతిక సహకార, స్నేహ సంఘం (ఇస్కఫ్), శ్రీకాకుళం సమితి ఏర్పాటు చేసిన టి.ఎస్.సుకుమారన్‌కు నివాళి అర్పించారు. ఏఐటియుసి గౌరవ అధ్యక్షులు చిక్కాల గోవిందరావు మాట్లాడుతూ అయన ఆశయాలకు అనుగుణంగా ఇస్కఫ్ కార్యక్రమాలు చేయాలనీ తెలిపారు. జిల్లా సమితి గౌరవ అధ్యక్షులు బుడుమూరు శ్రీరామమూర్తి మాట్లాడుతూ సుకుమారన్ ఆశయాలు కొనసాగాలని కోరారు. రౌతు శంకరరావు మాస్టారు, జిల్లా కార్యదర్శి జి.వి. నాగభూషణరావు, చౌదరి సత్యనారాయణ, సున్నపు చిన్నారావు, అన్నెపు జోగినాయుడు, సిరిగిరి నవచైతన్య వి.విజయ్ కుమార్ తదితరులు అయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టి.ఎస్. సుకుమారన్ మరణం పట్ల అయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేసారు. దోపిడీ, వివక్షకు గురైన ప్రజల స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమానత్వం కోసం శాంతియుత ఉద్యమాలు చేసిన ప్రగతిశీల నేత టి.ఎస్. సుకుమారన్ అని కొనియాడారు.



## సిపిఐ (మావోయిస్టు)పార్టీతో భారత్ ప్రభుత్వం చర్చలు జరపాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సిపిఐ(మావోయిస్టు)పార్టీ కేంద్రకమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో సహా అనేక మందిని హత్య చేసిన మోడీ ప్రభుత్వం ఫాసిస్టు చర్యను ఖండిస్తూ, మృత దేహాలను వారి బంధువులకు అప్పగించాలని కోరుతూ, శాంతి చర్చలకు సిద్ధపడ్డ మావోయిస్టు పార్టీతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని కోరుతూ శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కమిటీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు అందరిని వేదిక మీద ఆహ్వానించారు. సిపిఐ (ఎమ్.ఎల్) రాష్ట్ర అధికార ప్రతినిధులు పి ప్రసాద్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ సిపిఎం జిల్లా కార్యదర్శి దుప్పల గోవిందరావు సిపిఐ (ఎం.ఎల్) లిబరేషన్ జిల్లా నాయకులు యం.రామారావు, సిపిఐ (ఎంఎల్) జనశక్తి జిల్లా నాయకులు గురవయ్య, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం. లక్ష్మి, పౌరహక్కుల సంఘం జిల్లా నాయకులు పత్తిరి డానేషూ, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.వి.జగన్నాథరావు, అమరవీరుల బంధుమిత్రుల కమిటీ కోదండం, ప్రగతిశీల కార్మిక సమైక్య జిల్లా అధ్యక్షుడు మద్దెల ధర్మారావు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు కూర్మారావు, కులనిర్మూలన పోరాట రాష్ట్ర నాయకులు మిస్క కృష్ణయ్యలతో పాటు పీవోడబ్ల్యూ రాష్ట నాయకులు పి.పద్మ, కృష్ణవేణి, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు పోలా ఈశ్వర రావు, ఐ.ఎఫ్. టియు నాయకులు నీలం రాజు తదితరులు మాట్లాడుతూ సిపిఐ (మావోయిస్టు) పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఇంకా అనేక మంది ఆ పార్టీ నాయకులు, ఆదివాసీలను బూటకపు ఎదురు కాల్పుల పేరిట మోడీ ప్రభుత్వం హత్య చేసిన చర్యను ఈ సమావేశం ఖండించాలని తీర్మానించారు. కేశవరావుతో సహా మృతుల భౌతికకాయాలను వారి బంధువులకు అప్పగించాలన్నారు. నారాయణపూర్ మారణకాండతో సహా అడవుల్లో సాగిస్తున్న మారణహోమంపై సుప్రీంకోర్టు సిటింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగారును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ (మావోయిస్టు) పార్టీతో భారత ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. బూటకపు ఎదురు కాల్పుల పేరిట జరిగే మారణకాండపై నిరసన వ్యక్తం చేసే ప్రజాస్వామిక హక్కును కాలరాస్తున్న చంద్రబాబు కూటమి ప్రభుత్వం నిరంకుశ విధానాన్ని ఈ సమావేశం ఖండించిందన్నారు. ఖనిజ సంపదలు, ప్రకృతి వనరులతో కూడిన అడవులను బడా కార్పొరేట్లకు అప్పగించే ఆపరేషన్‌కు వ్యతిరేకంగా సాగుతున్న ప్రజాస్వామ్యకు ఉద్యమానికి ఈ సమావేశం సంఘీభావం ప్రకటించారు.





మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన పొలిటికల్ పార్టీ మీటింగ్‌లో పాల్గొని నియోజకవర్గంలో గల బూత్ పరిధిలో ఓటర్ల సమస్యలను వివరించి సమస్యలు పరిష్కరించవలసిందిగా నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, పోల్ మేనేజ్మెంట్ కన్వీనర్, రొణంకి కృష్ణంనాయుడు, పార్లమెంట్ అధికార ప్రతినిధి గొద్దు చిట్టిబాబు గారు,మండల పార్టీ అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, పట్టణ పార్టీ అధ్యక్షులు కింజరాపు రామారావు, వార్డ్ సభ్యులు గోలివి రామారావు, నాలుగు మండలాల అసిస్టెంట్ ఎలక్ట్రో రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, నరసన్నపేట


## రేషన్ బియ్యం వాహనాల రద్దుపై డీలర్ల హర్షం



(సత్యంన్యూస్, రాజాం)

ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎండీయూ విధానాన్ని రద్దుచేసి రేషన్ దుకాణాల ద్వారా సరుకులు పంపిణీకి ప్రభుత్వం నిర్ణయించడంపై విజయనగరం జిల్లా రాజాం మండలంలో రేషన్ డీలర్లు ఆనందం వ్యక్తం చేశారు. రాజాం సివిల్ సప్లైస్ గోదాము వద్ద సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చిత్రపటాలకు పాలతో క్షీరాభిషేకం చేశారు. అనంతరం రేషన్ డీలర్లు పరస్పరం స్వీట్లు తినిపించుకున్నారు. నాటి వైసీపీ ప్రభుత్వం డీలర్ల పొట్ట కొడితే కూటమి ప్రభుత్వం ఆదుకుందన్నారు. ఇక ప్రజలు పనులు మానుకుని రేషన్ వాహనం కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదని, నెలలో 15 వ తేదీలోగా లబ్ధిదారులు ఎప్పుడు వచ్చినా సరుకులు ఇస్తామని రేషన్ డీలర్లు తెలిపారు. వచ్చే నెల నుంచి ప్రభుత్వ మార్గదర్శ కాల ప్రకారం రేషన్ సరుకులను పక్కాగా పంపిణీ చేస్తామని వారు పేర్కొన్నారు.

## అవినాష్‌ను అభినందించిన యూనియన్ నాయకులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

డీసీఎంఎస్ చైర్మన్‌గా ఇటీవల ప్రభుత్వం ఎస్ఎం.పురం మాజీ సర్పంచ్ చౌదరి అవినాష్ పేరును ప్రకటించిన నేపథ్యంలో ఏపీ స్టేట్ సివిల్ సప్లై కార్పొరేషన్ లిమిటెడ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయ్ యూనియన్ జాయింట్ సెక్రెటరీ గంట సురేష్, అలాగే డిస్ట్రిక్ సివిల్ సప్లై హమాలీ యూనియన్ అధ్యక్షులు శ్రీమన్నారాయణ, ఎచ్చెర్ల మండల డీలర్ల ప్రెసిడెంట్ భాస్కరరావు, టీడీపీ సీనియర్ నాయకులు పోలినాయుడు, జగన్, బొంతల గూడూరు డీలర్లు శనివారం చౌదరి అవినాష్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఆయనకు కార్మిక నాయకులు ఘనంగా సన్మానం చేశారు.

## గ్రంథాలయంలో పిల్లలకు పుస్తక పరిచయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యాభివృద్ధికి గ్రంథాలయాలు ఉపయోగపడతాయని పి. ఉగ్రసేను అన్నారు బలగ హడ్కో కాలనీలో శాఖా గ్రంథాలయంలో శనివారం ఉదయం వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా ముందుగా నీతి కథలు చెప్పారు. తదుపరి గ్రంథాలయంలో ఉన్న వివిధ కథల పుస్తకాలు, భారతం, భాగవతం, శివపురాణం, పంచతంత్ర కథలు, పోటీ పరీక్ష పుస్తకాలు వారికి పరిచయం చేశారు. పిల్లలు ఆసక్తిగా పుస్తకాలను పరిశీలించారు ఈ సందర్భంగా బలగ మున్సిపల్ హైస్కూల్ బయోలాజికల్ సైన్స్ టీచర్ అప్పలనాయుడు పుస్తకాల ఆవశ్యకత గురించి వివరించారు ఈ కార్యక్రమంలో వరం హైస్కూల్ తెలుగు పండిట్ ఉప్పు త్రినాధరావు గారు పిల్లలకు నీతి కథలు చెప్పారు. కార్యక్రమంలో సహాయకురాలు కె. అనిత తదితరులు పాల్గొన్నారు



# అందరూ కలిసికట్టుగా కలిసి మెలిసి పని చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వైకాపా పటిష్టతకు నాయకులు, కార్యకర్తలంతా కలిసి పని చేయాలని వైకాపా జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ఈమేరకు జిల్లా పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్తలు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు అందరూ కలిసికట్టుగా కలిసి మెలిసి పని చేయాలన్నారు కార్యకర్తలకు అభిమానులకు తగిన గుర్తింపు ఇస్తామన్నారు. 50సంవత్సరాలు దాటిన వారికి వృద్ధాప్యం పింఛను నేటివరకు దాని ఊసే లేదన్నారు. శ్రీకాకుళం పార్లమెంట్ పార్టీ పరిశీలకులు కుంభా రవిబాబు మాట్లాడుతూ ఏపీలో అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని అభివృద్ధి సంక్షేమం ఊసే లేదని, రెడ్‌బుక్ రాజ్యమేలుతుందన్నారు. శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ సమన్వయకర్త తమ్మినేని సీతారాం మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసిన పార్టీ మనదేనని భవిష్యత్తులో పేదలకు మేలు చేసే పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని తెలియజేశారు. రాష్ట్ర డాక్టర్స్ విభాగం అధ్యక్షులు సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరాచకపాలన జరుగుతుందని, పరిపాలన గాడి తప్పిందని రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ కార్యకర్తలను నాయకులను ఇబ్బంది పెడుతున్నారని తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం పార్లమెంట్ పార్టీ పరిశీలకులు శ్రీ, కుంభ రవిబాబు, శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ సమన్వయకర్త తమ్మినేని సీతారాం, రాష్ట్ర డాక్టర్స్ విభాగం అధ్యక్షులు సీదిరి అప్పలరాజు, పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యులు రెడ్డి శాంతిలకు అభినందనలు తెలియజేసి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ సాయిరాజ్, ఎం.ఎల్.సి నర్తు రామారావు, సమన్వయకర్తలు రెడ్డి శాంతి (పాతపట్నం), చింతాడ రవి కుమార్ (ఆమదాలవలస) గొర్లె కిరణ్‌కుమార్ (ఎచ్చెర్ల) పేడాడ తిలక్ (టెక్కలి) వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి సత్యనారాయణ, వివిధ కార్పొరేషన్ మాజీ చైర్మన్‌లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, ఎమ్.పి.పిలు అంబటి నిర్మలశ్రీనివాస్, గొండు రఘురాం, బైరాగినాయుడు పోలాకి జడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, ఎచ్చెర్ల శ్రీధర్,ఎం స్వరూప్, గొండు కృష్ణ,జిల్లా గ్రీవెన్స్ విభాగం అధ్యక్షులు రౌతు శంకరరావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు మార్పు పృథ్వీరాజ్, తమ్మినేని చిరంజీవి నాగ్, చిట్టి జనార్ధన, మూకాళ్ళ తాతబాబు, గుంగు నరేంద్ర, గుండ హరీష్,ఎస్సీ సెల్ అధ్యక్షులు ముంజేటి కృష్ణ, బైరి మురళీ, తంగి అప్పన్న స్వామి, కింజరాపు రమేష్, బేగ్, కామేశ్వరి, సుగుణరెడ్డి యస్.సత్యనారాయణ, యజ్జల గురుమూర్తి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## రేపు నందీశ్వరునికి అభిషేకం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మొండేటి వీధిలో వెలసిన శ్రీ లలితా దేవి సహిత శివ కామేశ్వర వారి ఆలయంలో బహుళ త్రయోదశి & చతుర్దశిని పురస్కరించుకుని ఈనెల 25న శ్రీశ్రీశ్రీ శివకామేశ్వర స్వామి వారి దేవాలయంలో శ్రీ నందీశ్వర స్వామివారికి శ్రీ శివకామేశ్వర స్వామి వారికి విశిష్ఠ సుగంధ ద్రవ్యాలతోని పంచామృతాలతోని అభిషేకం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులంతా హాజరు కావాలని కోరారు.



## గేదెల రవికి అభినందన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఐఐటీ గౌహతీ నుండి పీహెచ్‌డీ పట్టా సాధించిన డాక్టర్ గేదెల రవిని కేంద్ర పౌరవిమానశాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అభినందించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) గౌహతీ బయోసైన్సెస్ అండ్ బయోఇంజినీరింగ్ విభాగంలో గేదెల రవి ప్రొఫెసర్ వెంకట దాసు వీరంకి, ప్రొఫెసర్ కన్నన్ పాక్షిరాజన్‌ల సంయుక్త పర్యవేక్షణలో “రోడోటోరుల ముసిలాజినోసా అనే ఓలియేజినస్ ఈస్ట్ ద్వారా లిపిడ్లు, కెరోటినాయిడ్లు, బీటా కెరోటిన్ ఉత్పత్తి”పై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు. ఈ పరిశోధన పునరుత్పాదక ఇంధన వనరులు, ఆరోగ్యానికి మేలు చేసే సమ్మేళనాల అభివృద్ధికి తోడ్పడే విధంగా ఉందన్నారు. పారిశ్రామిక స్థాయిలో తక్కువ ఖర్చుతో బయోప్రాసెసింగ్ విధానాల అభివృద్ధికి ఈ పరిశోధన ఫలితాలు ఎంతో ఉపయోగపడతాయని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. సీతంపేట మండలం, పెద్దపల్లంకి వలస అనే గిరిజన ప్రాంతం నుంచి రావడమే కాకుండా, అంతటి ప్రఖ్యాత విద్యాసంస్థలో డాక్టరేట్ పట్టా సాధించడమంటే పట్టుదల, కృషి, సంకల్పం కలయికను సూచిస్తుందని కొనియాడారు. ఈ సందర్భంగా డాక్టర్ గేదెల రవికి మంత్రి తన హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.



డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషన్లు, ఫేషన్ మేకర్, ఎంబ్రాయిడరీ మిషన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ: వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

అక్కడ నడకే ఉయ్యాల జంపాలా..

# పోతే ఆ రోడ్డుపైనే సాగాల!

- గతుకులతో చితికిన మేదరవీధి రోడ్డు
- పెద్దమార్కెట్‌కు ఇదే ప్రధాన మార్గం
- నిత్యం వాహనాల రాకపోకలతో తీవ్ర రద్దీ
- ప్రమాదాలతో వాహనదారుల సావాసం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని మేదరవీధిలో వెదురుతో అల్లిన ఉయ్యాలలో ఊగితే స్వింగ్ అవుతారో లేదో తెలీదు గానీ.. ఆ రోడ్డు మీద నడవాల్సి వస్తే మాత్రం ఉయ్యాలా జంపాలా.. అంటూ ఊగకుండా వెళ్లడం కష్టం. మేదరవీధి అని పేరుకు చెప్పుకుంటాం గానీ.. అది పెద్దమార్కెట్‌కు ప్రధాన మార్గం. భారీఎత్తున వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో గతంలో హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ ఇక్కడే ఉన్నప్పుడు దిట్టంగా సీసీ రోడ్డు వేశారు. ఆ తర్వాత హోల్‌సేల్ మార్కెట్ లక్ష్మీ థియేటర్ పక్కకు వెళ్లిపోయినా మిగిలిన కిరాణా, చేపలు, చికెన్ మార్కెట్లు మాత్రం ఇక్కడే కొనసాగుతున్నాయి. నగరంలోని మిగతా వీధి రోడ్లపై రాకపోకలు సాగించే వాహనాల సంఖ్యతో పోలిస్తే మేదరవీధి రోడ్డులో ప్రయాణించే వాహనాల సంఖ్య పదిరెట్లు ఎక్కువగా ఉంటుంది. బహుశా అందుకే రోడ్డును బలంగా నిర్మించి ఉంటారు. కానీ ప్రస్తుతం ఈ రోడ్డు పూర్తి అస్తవ్యస్తంగా తయారైంది. మార్కెట్ రోడ్డు కావడం, దశాబ్దాల తరబడి కార్పొరేషన్‌కు ఎన్నికలు లేకపోవడం, ప్రజా పాలకులు రాకపోవడం వంటి కారణాల వల్ల ఈ సమస్య నగరపాలక సంస్థ కమిషనర్ ఛాంబర్ కళ్లెదుటే కనిపిస్తున్నా పట్టించుకునేవాడు కనిపించలేదు. సీసీ రోడ్డు పాడైందని గతంలో అందిన ఫిర్యాదు మేరకు దానిపైనే మందంగా బీటీ (తారు రోడ్డు) వేశారు. ఆ తర్వాత కాలంలో ఎండకు తారు కరిగిపోయింది. వాహనాల టైర్లతో పాటు పిక్క వెళ్లిపోయింది. దీంతో కింద సీసీ రోడ్డు.. పైన బీటీ రోడ్ల మధ్య పెద్ద పెద్ద గోతులు దర్శనమిస్తున్నాయి. సాధారణంగా రోడ్డుపై ఒకవైపు గోతులు ఏర్పడితే మరో పక్కగా వెళ్లడానికి వాహనదారులు ప్రయత్నిస్తారు. కానీ ఈ రోడ్డు మొత్తం గుంతలు పడటంతో ఉయ్యాలా జంపాలా మాదిరిగా వాహనం దిగితే మళ్లీ లేచే పరిస్థితి కనిపించదు. ఇక యాక్టివా లాంటి స్కూటీ తరహా వాహనాలైతే ఈ గోతుల్లో పడిన తర్వాత లేచి తోసుకోవాల్సిందే. ఈ రోడ్డుకు రెండువైపులా 50కి పైగా చికెన్ దుకాణాలుంటాయి. ఫిష్ మార్కెట్‌కు మెయిన్ ఎంట్రన్స్ ఇటు నుంచే. మేదర వీధికి ముఖద్వారం ఇదే. అన్నిటికీ మించి ఉయ్యాలా జంపాలా అంటూ ఈ ప్రాంతంలో ఎవరైనా పోతే నలుగురు మోయాలనేది కూడా ఈ రోడ్డు పైనుంచే! గోల్కొండ రేవు రోడ్డు మీదుగా నాగావళిలో శ్మశానానికి వెళ్లాలంటే మొండేటివీధి, మేదరవీధి, కాకివీధి, రంగిరీజు వీధి, ఎచ్చెర్లవీధి, బలగవీధితో పాటు అనేక ప్రాంతాల వారికి ఇదే మార్గం. ఇప్పుడంటే స్వర్గధామమంటూ సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ పక్కన ఒక శ్మశానం ఏర్పాటు చేసి, మోసే బాధ లేకుండా వాహనమెక్కించి దహన సంస్కారాలు చేస్తున్నారు గానీ, పాత శ్రీకాకుళం ప్రాంతం వారికి నాగావళి ఒడ్డే శ్మశానం. ఇప్పుడు ఈ రూట్‌లో శవయాత్ర చేయాలంటే ఉయ్యాలా జంపాలా తప్పడంలేదు.

## డాక్యుమెంట్లు పోయినవి

డాక్యుమెంట్ నెం. 6803/2016 గల దస్తావేజులు తే 07-05-2025 దీన ఇల్లు మారుస్తున్నపుడు దారిలో పడిపోయినవి. ఇవి ఎవరికైనా దొరికినట్లయితే ఈ దిగువ చిరునామాకు ఫోన్ చేసి తెలియజేసి ఇచ్చినట్లయితే తగిన పారితోషికము ఇవ్వబడును.

**పి.వి.నారాయణమూర్తి**
డో.నెం. 13-9-147/5, కాకివీధి,
శ్రీకాకుళం-532001
సెల్: 7382118129

# యోగాతో ఆరోగ్యం



(సత్యంన్యూస్, ఆమదాలవలస)

యోగాతో ఆరోగ్య సమస్యలను అధిగమించవచ్చని యూనివర్సల్ యోగా సైంటిస్ట్ బగాది పాపారావు స్పష్టం చేశారు. శనివారం స్థానిక పురపాలక సంఘం ఆవరణలో కమిషనర్ బాలాజీప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బందికి యోగాపై అవగాహన చేపట్టారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ యోగాను నిత్యం సాధన చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు తొలగుతాయన్నారు. మధుమేహం, రక్తపోటుతో పాటు అనేక దీర్ఘకాలిక సమస్యలకు యోగా శాశ్వత పరిష్కారం చూపిస్తుందన్నారు. జూన్ 21న విశాఖ వేదికగా నిర్వహిస్తున్న జాతీయ యోగా దినోత్సవాన్ని పరిష్కరించుకొని యోగాపై దేశవ్యాప్తంగా అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. అనంతరం యోగాసనాలు వేసి సాధన చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, పలువురు స్థానికులు పాల్గొన్నారు.

మరో రాయబారి వచ్చె!

# ఈయన అదే సమాధానమిచ్చె

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. వాస్తవానికి అప్పట్నుంచే పరిస్థితిలో మార్పు కూడా కనిపించింది. ధర్మాన ఆరోగ్యం కోసం మాత్రమే ఆరా తీసి వదిలేసిన జగన్మోహన్ రెడ్డి ఆ తర్వాత ధర్మాన ఈ జిల్లాకు ఎందుకు అవసరమో ఆరా తీయడం ప్రారంభించారు. పార్టీ నుంచి వెళ్లిపోయిన విజయసాయిరెడ్డిని అడిగినా, పక్క జిల్లాలో ఉన్న బొత్స సత్యనారాయణను అడిగినా, పరిశీలకులుగా వచ్చిన ఎవర్ని అడిగినా ధర్మాన లేని వైకాపా కోసం పాజిటివ్‌గా చెప్పకపోవడంతో ఆయన పార్టీలో ఇన్‌యాక్టివ్‌గా ఉన్నా, పార్టీ మాత్రం ఆయన వెంటే ఉంటామన్న సంకేతాన్ని పంపిస్తుంది. అందులో భాగమే తాజాగా కుంభా రవిబాబు రావడం. జిల్లాలో ప్రస్తుత పరిస్థితులు ధర్మానకు అనుకూలంగా ఉన్నా, తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదన్న పద్ధతిని ఆయన అవలంభిస్తున్నారు. ప్రభుత్వం వచ్చి ఏడాదే కావడం వల్ల మరికొంత కాలం వేచిచూసే ధోరణే బెటరన్న ఆలోచన ధర్మానది. జిల్లాలో వైకాపా శ్రేణులకు వచ్చిన నష్టం, కష్టం ఏమీ లేదని, కేవలం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించాలంటే మాత్రం మరికొంత సమయమివ్వాలన్న భావన ధర్మానకు ఉంది.

2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి హవాతో అధికారంలోకి వచ్చినా, 2009లో ప్రభుత్వ వ్యతిరేక ఓటును పీఆర్పీ ద్వారా చీల్చడం, కాంగ్రెస్ అభ్యర్థులను గుర్తించి బలోపేతం చేయడం వంటి అంశాల్లో రాజశేఖరరెడ్డి ధర్మానకే ఫ్రీహ్యాండ్ ఇచ్చారు. అందుకే రాజశేఖరరెడ్డి సొంత జిల్లా కడప మాదిరిగానే పదింటికి తొమ్మిది సీట్లు ఇక్కడ కాంగ్రెస్ గెలుచుకోగలిగింది. ఇప్పుడు మళ్లీ అదే వాతావరణం రావాలంటే ధర్మాన ప్రసాదరావుకు మళ్లీ అంతే స్థాయి స్వేచ్ఛ ఇవ్వాలన్న ప్రతిపాదన ఒకటి అధిష్టానానికి వెళ్లినట్టు భోగట్టా. ధర్మాన కృష్ణదాస్ జిల్లా పార్టీ అధ్యక్షునిగా వ్యవహరిస్తున్నా, అందుకు కర్త, కర్మ, క్రియ మాత్రం ధర్మానేనని పార్టీ భావిస్తుంది. ఒకానొక సందర్భంలో జిల్లా పార్టీ అధ్యక్షుడ్ని మార్చాలన్న ప్రతిపాదన వచ్చినప్పటికీ పదవి లేకుండా అన్న, పదవి తీసుకోకుండా తమ్ముడు ఇద్దరూ బయట ఉంటే, వైకాపా తరఫున తప్పుడు సంకేతాలు వెళ్తాయని పార్టీ భావించి, ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకుంది. ఆ తర్వాత పరిణామాలు ధర్మానకు అనుకూలంగానే జరుగుతూ వస్తున్నాయి. ఆమదాలవలసలో చింతాడ రవిని ఇన్‌ఛార్జిగా నియమించడం, టెక్కలి ఇన్‌ఛార్జిగా తిలక్‌ను ఉంచడంతో పాటు దువ్వాడ శ్రీనును పార్టీ నుంచి సస్పెండ్ చేయడం వంటివి ధర్మానకు స్వాంతన చేకూర్చే చర్యలే. అయితే ఇంకా రెండు నియోజకవర్గాలకు సంబంధించే ధర్మానకు, పార్టీకి మధ్య పీఠముడి వీడాల్సి ఉంది. ఇచ్ఛాపురంలో రెడ్డిక సామాజికవర్గానికి ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వాలని ఎప్పటినుంచో ధర్మాన కోరుతున్నారు. అలాగే పాతపట్నం నుంచి మామిడి శ్రీకాంత్‌ను ఎమ్మెల్యేగా చూసుకోవాలన్నది ధర్మాన కోరిక. అయితే ఈ రెండు అసెంబ్లీ సెగ్మెంట్లపైనే జగన్మోహన్‌రెడ్డి కూడా పట్టుగా ఉన్నారు. ఏం జరుగుతుందో వేచిచూడాలి.

# బీడు భూములకు బంగారు భవిష్యత్తు





(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రస్తుత కాలంలో వ్యవసాయరంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. మిగులు భూములు లేదా వినియోగించని బీడుభూములు పలు ప్రాంతాల్లో పెరుగుతున్నాయి. భారతదేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో అధికశాతం వ్యవసాయ భూములు ఇంకా తగిన వినియోగం లేకుండా ఉన్నాయి. జిల్లాలో నీటి కొరత, వలస పోతున్న రైతులు ఎక్కువగా ఉండటం, పెట్టుబడి ఖర్చులు గణనీయంగా పెరగడం, కూలీల కొరత తదితర పరిస్థితుల వల్ల బీడు భూముల విస్తీర్ణం పెరిగిపోవడానికి ముఖ్య కారణాలు. శ్రీకాకుళం జిల్లాలో ప్రస్తుతం 3,550 హెక్టార్ల బీడు భూములు ఉన్నట్టు అంచనా. ఇటువంటి భూములను ఉద్యాన పంటల సాగుకు ఉపయోగిస్తే ఆయా భూముల విలువను పెంచడమే కాకుండా, సాగులో ఉన్న అనిశ్చితిని తగ్గించి దీర్ఘకాలిక ఆదాయం పొందే అవకాశం ఉంటుంది. తోటల సాగు అంటే కేవలం మామిడి, జీడి మామిడి, కొబ్బరి మొదలైనవి మాత్రమే కాకుండా జామ, సీతాఫలం, నిమ్మ, నేరేడు, రేగు, మునగ, గులాబీ, మల్లి వంటి పూల సాగు, ఆయుర్వేద గుణాలు, సుగంధ తైల మొక్కల సాగూ ఇందులో భాగమే. ఈ తోట పంటలు తక్కువ నీటితో పెరిగే సామర్థ్యం కలిగివుండటంతో బీడుభూములకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. తోటల సాగుకు ఒకసారి పెట్టుబడి పెట్టిన తర్వాత, పదే పదే నాటుకునే అవసరం లేకుండా చాలా ఏళ్ల వరకూ ఆదాయం ఇవ్వగలుగుతుంది. 90% రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లను అమర్చుకోవడం ద్వారా నీటిని 60 నుంచి 80 శాతం ఆదా చేసుకుని ఈ బీడు భూములను సస్యశ్యామలం చేసుకోవచ్చు. అంతే కాకుండా జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా సన్న, చిన్నకారు రైతులు తమ పొలంలో నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తుంది. బహు వార్షిక పంటలకు నాటిన వెంటనే ఆదాయం రాదని చింతించకుండా కూరగాయాలు, బొప్పాయి, అరటితో పాటు పసుపు, అల్లం వంటి పంటలను అంతర పంటగా వేసుకోవడం ద్వారా అదనపు ఆదాయం సంపాదించే అవకాశం ఉంటుంది. తోటల సాగు వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. మొక్కల పెంపకం, కోత, నిల్వ, విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెటింగ్ వంటి అన్ని దశల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ముఖ్యంగా గ్రామీణ మహిళలు, యువత ఈ రంగంలోకి చేరేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో హార్టికల్చర్ క్లస్టర్లు, ప్రాసెసింగ్ యూనిట్లు, శీతలీకరణ గదులు ఏర్పాటుచేసి రైతులకు మార్కెట్ లింకేజ్ అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ చర్యలు బీడు భూములకు నూతన జీవం పోస్తూ, వ్యవసాయ రంగంలో స్థిరమైన అభివృద్ధికి దోహదపడతాయి. బీడుభూములను వదిలేయకుండా, వాటిని తోటల సాగుకు మలచుకోవడమే నేటి సవాల్. రైతులు ఉద్యాన శాఖ సలహాలు తీసుకుని, వారి భూములలో అనువైన తోట పంటలు ఎంచుకోవాలి. ఇది వ్యవసాయ రంగంలో స్థిరమైన అభివృద్ధికి దోహదపడుతుంది. ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లగలిగితే, భవిష్యత్తులో అన్నదాత ఆదాయాన్ని రెట్టింపు చేయడం సాధ్యమే. బీడు భూములకు నూతన జీవం పోసే మార్గం తోటల సాగే. రాష్ట్ర వ్యవసాయ, ఉద్యాన శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ నెల 21న ఖరీఫ్ పంటల సీజన్‌కు సంబంధించి ప్రాథమిక రంగ శాఖాధిపతులతో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమీక్షలో రైతులు పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. ఇందులో భాగంగా జిల్లాకు 80 వేల హెక్టార్ల లక్ష్యాన్ని వ్యవసాయ పంటల నుంచి ఉద్యాన పంటలకు మార్పిడి చేయవలసిందిగా నిర్దేశించారు. ఇది కాకుండా 2025-26లో జిల్లాలో ఉద్యాన విస్తరణకు ప్రభుత్వం పలు ముఖ్యమైన పథకాలను అమలు చేయనుంది. జిల్లాలో మొత్తం 5678 హెక్టార్ల భూమిలో ఉద్యాన పంటల విస్తరణ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ప్రధానంగా సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్ ద్వారా 398 హెక్టార్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ద్వారా 60 హెక్టార్లు, కేంద్ర ఆయిల్ పామ్ మిషన్ ద్వారా 800 హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు చేయాలని లక్ష్యంగా ఉందని జిల్లా ఉద్యాన అధికారి రత్నాల వరప్రసాద్ తెలిపారు. అలాగే జాతీయ వెదురు మిషన్ కింద 10 హెక్టార్లు, పంటల వైవిధ్యీకరణ ద్వారా 100 హెక్టార్లు, ఉపాధి హామీ పథకం ద్వారా 1260 హెక్టార్లలో తోటల విస్తరణ చేపట్టనున్నారు. అదనంగా, కొబ్బరి అభివృద్ధి బోర్డు ద్వారా 300 హెక్టార్లలో కొబ్బరి పంట విస్తరించనున్నారు. దీనికితోడు, జిల్లాలో సాగుకు అనువైన 3550 హెక్టార్ల బీడు భూములను గుర్తించి సేద్యయోగ్యమైన భూములుగా వినియోగించే దిశగా ఉద్యాన అధికారులకు ఇప్పటికే తగు సూచనలు ఇచ్చింది.

# కమిషనర్ గారూ కాస్త పట్టించుకోండి..!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కాలువలు డెబ్రిస్‌తో నిండిపోతున్నాయని, అదే విధంగా పశువులను సదరు యజమానులు రోడ్లపై విడిచిపెట్టేయడంతో రోడ్లు చెండాలంగా తయారవుతున్నాయని, దీనిపై నగరపాలక కమిషనర్ పట్టించుకోవాలని తుమ్మావీధి వాసులు కోరుతున్నారు. ఒకసారి కమిషనర్ సడన్ విజిట్ చేసి వీధి పరిస్థితి పరిశీలిస్తే శానిటరీ కార్మికుల పనితీరు అర్థమవుతుందని అంటున్నారు. ఈ వీధిలో కాలువలు పూర్తిగా డెబ్రిస్‌తో నిండిపోయాయని చెప్పడానికి ఈ కాలువలే నిదర్శనమని వాపోతున్నారు.






### సిల్ట్ తీయడం మాటేమో గానీ..

ఎప్పటికప్పుడు ఇక్కడ పెద్ద కాలువ కింద డెబ్రిస్ తీసే నెపంతో జేసీబీ పెట్టి పలకలు లేపేయడం, మురుగు తీశామనిపించి పలకలు ఇష్టం వచ్చినట్టు వేయడంతో పలకల మధ్య ఖాళీలు ఏర్పడి ద్విచక్ర వాహనదారులు రోజుకు కనీసం ముగ్గురైనా ఇక్కడ పడిపోవడం మామూలైపోయింది. ఎన్నిసార్లు సిల్ట్ తీసినా మురుగు నీరు మాత్రం రోడ్డుపైనే ఉండిపోతోంది మరేంటో..! వర్షాకాలంలో అయితే చెప్పనక్కర్లేదు.

### ఒక్కసారి విజిట్ చేయండి

గత కమిషనర్లు అడపాదడపా ఉదయం వార్డులు విజిట్ చేసేవారని, కనీసం వారు వస్తున్నారన్న భయంతోనైనా శానిటేషన్ వర్కర్లు వీధుల్లో విధులు సక్రమంగా నిర్వహించేవారని, అలాగే పశువులను సైతం యజమానులు రోడ్లపై విడిచిపెట్టకుండా జాగ్రత్తపడేవారని, నేడీ పరిస్థితి కానరావడంలేదని స్థానికులు వాపోతున్నారు. కనీసం ఎంహెచ్‌వో అయినా తమ వీధిని పరిశీలించాలని కోరుతున్నారు.

## కీర్తిచక్ర అవార్డు గ్రహీతకు సీఎం అభినందన



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కీర్తిచక్ర అవార్డు పొంది సిక్కోలు కీర్తిప్రతిష్టలు దేశానికి చాటి చెప్పిన మేజర్ మల్లా రామ్ గోపాలనాయుడును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర కేబినెట్ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అభినందించారు. కీర్తిచక్ర అందుకున్న గోపాలనాయుడు కుంటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు.




Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.